గడువు పూర్తి.. తొలగింపుతో కుస్తీ

జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్ అంతా వ్యాపార సముదాయ దారులన్నీ కూల్చివేత, మరమ్మతుల దృశ్యాలే కనిపించాయి. బుధవారం ఉదయం నుంచి గంగారెడ్డి రోడ్డు మొదలుకుని ముఖరాం చౌరస్తా, పొట్టిశ్రీరాములు విగ్రహం దగ్గర ప్రారంభమై పోలీస్‌స్టేషన్ వరకు నలువైపులా సంబంధిత పనులతో హడావుడిగా కనిపించింది. కొన్ని దుకాణాలు మెట్ల వరకు తొలగిస్తే మరికొన్ని దుకాణాలే కనుమరుగయ్యాయి. ఈ చర్యలతో మార్కెట్ ప్రాంతం విశాలంగా మారేలా కనిపిస్తున్నా కొంతమందిలో మాత్రం తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి తమకు ఆధారం చూపాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, ఏసీసీ, మంచిర్యాల సిటీ


అర్చన టెక్స్‌చౌరస్తాలో ఓ దుకాణానికి సూచించిన గుర్తు వరకు తొలగిస్తూ..


బుధవారం తెల్లవారుజామున ఓ షాపును పూర్తిగా తొలగిస్తున్న దృశ్యం

మాతా, శిశు మరణాల నియంత్రణపై దృష్టి

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లాలో మాతా, శిశు మరణాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో వైద్యారోగ్యశాఖ, జిల్లా సంక్షేమశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక కేంద్రాల పరిధిలో గర్భిణుల వివరాలు నమోదు చేసుకొని ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. చిన్నారులకు వంద శాతం టీకాలు అందించే ప్రక్రియ చేపట్టాలన్నారు. జిల్లా అధికారులు హరీశ్‌రాజ్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రమణ, స్వరూపారాణి, అనిత పాల్గొన్నారు.

ప్రాణరక్షణ కేంద్రాలు కావాలి..

● నేడు ప్రపంచ ట్రామా దినోత్సవం



ఇదే దిక్కు..

ప్రస్తుతం రిమ్స్‌లో ఉన్న ట్రామా కేర్ యూనిట్ ఇది. ప్రమాదాల బారినపడి ప్రాణాపాయ స్థితిలో వచ్చే బాధితులకోసం ఈ వార్డులో చికిత్సలు అందిస్తున్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే మాత్రం రెండో అంతస్తులోకి తరలించాల్సి వస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ట్రామాకేర్ యూనిట్‌లు అందుబాటులో లేక ప్రమాదాలబారిన పడిన వారి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న జిల్లా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలనుకున్న ట్రామాకేర్ యూనిట్‌లు ప్రతిపాదనదశలోనే మగ్గుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారి 44, మంచిర్యాల నుంచి కుమురం భీం జిల్లా వాంకిడి మండలం గోయెగాం వరకు ఉన్న 94 కి.మీ.ల 363 నెంబరు రహదారి, నిర్మల్ జిల్లాలో బైంసా వరకు ఉన్న 61వ నెంబరు జాతీయ రహదారులు ప్రమాదకరంగా మారింది. ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని పురస్కరించుకొని పరిస్థితులపై 'న్యూస్‌టుడే' కథనం.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వైద్య విభాగం

ఎందుకంటే!

ప్రపంచ వ్యాప్తంగా రహదారి ప్రమాదాల్లో లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకొని వారి కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించటానికి 2013 నుంచి 'ట్రామా దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

అత్యంత ప్రమాదకరం

గుడిహత్నూర్ మండలం జాతీయ రహదారి-44పై ఉన్న మేకలగండి ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఏడాది కిందట జరిగిన ప్రమాదంలో నలుగురు, ఆ తరువాత చోటు చేసుకున్న ఆటో ప్రమాదంలో మరో ముగ్గురు, ఇటీవల జరిగిన ప్రమాదంలో అయిదుగురు చనిపోయారు.



నిర్మాణంలో క్రిటికల్ కేర్ భవనం




ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి వైద్యమందించేందుకు రిమ్స్‌లో ప్రస్తుతం క్రిటికల్ కేర్ భవనం రూ. 23.75 కోట్లతో నిర్మిస్తున్నారు. నిర్మాణం పూర్తయ్యాక రూ. 11 కోట్లతో అత్యాధునిక యంత్ర పరికరాలు ఇందులో ఏర్పాటు చేయనున్నారు. ఇది త్వరగా పూర్తయితే ప్రాణాపాయ స్థితిలో వచ్చేవారికి ప్రాణప్రదాయినిగా మారనుంది.

మూలమలుపులతో..



మంచిర్యాల జిల్లాలోని జాతీయ రహదారి 363పై తాండూరు మండలంలో బోయపల్లిగేటు వద్ద చోటు చేసుకున్న ఆటో ప్రమాదం ఇది. ట్రామాకేర్‌లు అందుబాటులో లేక మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స అందజేశారు.



ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు (సెప్టెంబరు వరకు)

జిల్లా	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
ఆదిలాబాద్	202	92	154
నిర్మల్	284	111	291
మంచిర్యాల	384	134	325
కుమురంభీం	87	64	172

ప్రతిపాదన దశలోనే..

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 25 చోట్ల ట్రామా కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయటానికి 2022లో అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో నిర్మల్, ఆదిలాబాద్‌లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కాని అవి ప్రతిపాదన దశలోనే ఉండిపోయాయి.

ఉమ్మడి జిల్లాలో బ్లాక్ స్పాట్లు ఇవే..

◆ **ఆదిలాబాద్ జిల్లాలో** 44వ జాతీయ రహదారిపై జందాపూర్ ఎక్స్‌రోడ్డు, భోరజ్, మావల సమీపంలోని దేవాపూర్ ఎక్స్‌రోడ్డు, గుడిహత్నూర్ మండలం మేకలగండి, ఇచ్చోడ మండలం గాంధీనగర్, నేరడిగొండ మండలం కుప్టి, దూద్‌గండి, కొరటికల్ మూలమలుపు

◆ **మంచిర్యాల** జిల్లాలో ఇందారం, శ్రీరాంపూర్ ఎక్స్ రోడ్డు, సోముగూడెం, రేపల్లెవాడ, తాండూర్ రైల్వే గేటు, బోబెపల్లి బోర్డు ప్రాంతాలు.

◆ **నిర్మల్ జిల్లాలోని** 61వ జాతీయ రహదారిపై చిట్యాల, దిలావర్‌పూర్, కల్లూర్, నర్సాపూర్, నసీరాబాద్ ప్రాంతాలు

◆ **కుమురంభీం జిల్లా** గుండా వెళ్లే 363 జాతీయ రహదారిపై వాంకిడి, కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు, రెబ్బెన గోలేటి, తాండూరు ప్రాంతాల్లో ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి.

తెరుచుకోని పాఠశాల.. ఆటల్లో విద్యార్థులు

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యార్థులకు విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తూ సర్కారు పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు విద్య, పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయి. మారుమూల ప్రాంతాల్లో పని చేసేవారు మండల, పట్టణ ప్రాంతాలకు వెళ్లారు. అయితే గిరిజన ప్రాంతాలకు రావడానికి ఉపాధ్యాయులు సుముఖత చూపడం లేదు. దీంతో గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఫలితంగా దండేపల్లి మండలం మామిడిపల్లి పంచాయతీ పరిధి కంచరాబాయి గిరిజన గ్రామంలో ఉపాధ్యాయుడు లేక పాఠశాల తెరుచుకోవడం లేదు. దీంతో విద్యార్థులు ఆటల్లో నిమగ్నమవుతున్నారు. విద్యతోపాటు పాఠశాలలో అందించే పౌష్టికాహారం సైతం వారికి అందడం లేదు. స్థానికంగా విద్యావాలంటీర్‌ను అయినా నియమించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' డీటీడీఓ గంగారాంను సంప్రదించగా ఆశ్రమ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులను కంచరబాయి, కుందేల్‌పహాడ్ పాఠశాలలకు సర్దుబాటు చేశామని, వారు విధులకు ఎందుకు రాలేదో తెలుసుకుంటామని పేర్కొన్నారు.


దండేపల్లి మండలం మామిడిపల్లి పంచాయతీ పరిధి కంచరబాయిలో తాళం వేసి ఉన్న పాఠశాల


ఆడుకుంటున్న చిన్నారులు



ఆర్జీయూకేటీకి మళ్లీ ఇన్‌ఛార్జి వీసీనే

● వెంకటరమణ బదిలీ ● కొత్త ఉపకులపతికి పరీక్షే

ఈటీవీ-ఆదిలాబాద్, న్యూస్‌టుడే, బాసర(ముధోల్): బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాని(ఆర్జీయూకేటీ)కి మళ్లీ నిరాశనే ఎదురైంది. శాశ్వత ఉపకులపతి నియామకం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటం ఫలించలేదు. రెండున్నరేళ్లుగా ఇన్‌ఛార్జి ఉపకులపతిగా పనిచేస్తున్న ఆచార్య వెంకటరమణను బుధవారం బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో జేఎన్‌టీయూహెచ్ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యుడు ఎ.గోవర్ధన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించింది. తొలిసారిగా 2010లో శాశ్వత ఉపకులపతిగా నియమితులైన ఖరగ్‌పూర్ విద్యావేత్త రాజ్‌కుమార్ విధి నిర్వహణ 2015 వరకు కొనసాగింది. ఆతరువాత శాశ్వత ఉపకులపతుల నియామకం ఆగిపోయింది. ఇన్‌ఛార్జిల పాలనతోనే నెట్టుకురావాల్సి వస్తోంది. మిగిలిన విశ్వవిద్యాలయాల మాదిరిగానే కులపతిగా గవర్నర్‌ను, ఆయన పర్యవేక్షణలో శాశ్వత ఉపకులపతిని నియమించాలనే విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా ఆ డిమాండ్ నెరవేరలేదు.

సమస్యలు అనేకం

తాజాగా ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియమితులైన ఎ.గోవర్ధన్ బాధ్యతల నిర్వహణ పరీక్షే. సవాలక్ష సమస్యలతో విద్యార్థులు కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఇంటర్న్‌షిప్ లేదు. ల్యాప్‌టాప్‌లు, ఆధునిక వసతులు అందుబాటులో లేవు. ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్న 90 మంది అధ్యాపకులు, వంద మంది బోధనేతర సిబ్బంది క్రమబద్ధీకరణ అంశం, శాశ్వత ఉపకులపతి కావాలనే విద్యార్థుల ప్రధాన డిమాండ్ అపరిష్కృతంగా ఉన్నాయి. అక్రమాలకు కేంద్రబిందువుగా మారాయనే మెస్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగానే ఉంది. ఒక్కో సమస్యను అధ్యయనం చేయటం, ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడం, ఆర్జీయూకేటీలో విద్యావ్యవస్థను గాడిన పెట్టడంలో ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ ఏమేరకు సఫలీకృతమవుతారనేది ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

సఫలం కాని ప్రయత్నాలు

రెండేళ్ల కిందట శాశ్వత ఉపకులపతి నియామకమే ప్రధాన డిమాండ్‌గా విద్యార్థులు చేసిన నిరవధిక ఆందోళన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. స్పందించిన అప్పటి ప్రభుత్వం విద్యార్థులను శాంతింపచేసేలా తొలుత 2022 జూన్‌లో ఓయూ ఆచార్యుడు సతీష్‌కుమార్ డైరెక్టర్ నియమించింది. విద్యార్థుల ఆందోళన కాస్త సద్దుమణిగాక అదే ఏడాది ఆగస్టులో ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆచార్య వెంకటరమణను ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియమించింది. ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా, ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతల కారణంగా వెంకటరమణ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పాలకుల పట్టింపులేనితనంతో ఆర్జీయూకేటీలో వ్యవస్థీకృతమైన లోపాలను సరిదిద్ది, విద్యాప్రమాణాలు పెంచటానికి ఆయన చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. పైగా విశ్వవిద్యాలయం ప్రారంభమైన 2008 నుంచి 2023 జూన్ 13 వరకు 15 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడితే, 2023 జూన్ 15 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఆరుగురు ఆత్మహత్యలకు ఒడిగట్టడం అలజడి రేకెత్తించింది. తాజాగా విద్యార్థులు ఆందోళనకు దిగడం ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. దాంతో పాటు పదవీకాలం రెండున్నరేళ్లు పూర్తి కావటంతో వెంకటరమణను బదిలీ చేసిన ప్రభుత్వం గోవర్ధన్‌ను నియమించింది.

వార్డు కమిటీలు నామమాత్రం..

● బల్దియాల్లో సమస్యలు యథాతథం


చెన్నూరు పురపాలిక బెస్తవీధిలో మురుగుకాలువ దుస్థితి ఇది

చెన్నూరు, న్యూస్‌టుడే

పట్టణాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పురపాలక సంఘాల్లో ఏర్పాటు చేసిన వార్డు కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి. అభివృద్ధి పనుల్లో పాలక వర్గం, అధికార యంత్రాంగంతోపాటు ప్రజలను భాగస్వాములను చేసే లక్ష్యంతో 2020 ఏప్రిల్‌లో గత ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. ఉన్నత లక్ష్యంతో చేపట్టిన వార్డు కమిటీల ప్రక్రియ కేవలం ఎంపిక వరకే పరిమితమైంది. నాలుగేళ్ల నుంచి ఇప్పటి వరకు జరిగిన పనుల్లో కమిటీల భాగస్వామ్యం ఏమాత్రం కనిపించకపోవడం విడ్డూరంగా మారింది.

జిల్లాలోని ఏడు పురపాలక సంఘాల్లోని 696 కమిటీల్లో 10,440 మంది సభ్యులను ఎంపిక చేశారు. వివిధ పట్టణాల్లో రాజకీయ కారణాలతో కమిటీలు నామమాత్రం అయ్యాయి. మరికొన్ని చోట్ల అధికారుల నిర్లక్ష్యంతో నిస్తేజంగా మారాయి. ఏర్పాటు చేసిన రోజు మినహా సభ్యులను ఇంత వరకు పుర కార్యాలయాలకు పిలిచింది లేదు. దీంతో వార్డుల్లో నెలకొన్న అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఈ ప్రభుత్వమైనా వార్డు కమిటీల ప్రాధాన్యతను గుర్తించి గాడిన పెడితే పట్టణ అభివృద్ధికి దోహదపడనుంది.

జిల్లాలోని బల్దియాల్లో వార్డులు, కమిటీలు, ఎంపిక చేసిన సభ్యుల సంఖ్య

పట్టణం	వార్డులు	కమిటీలు	సభ్యులు
మంచిర్యాల	36	144	2,160
బెల్లంపల్లి	34	136	2,040
మందమర్రి	24	96	1,440
నస్పూరు	25	100	1,500
లక్షెట్టిపేట	15	60	900
క్యాతన్‌పల్లి	22	88	1,320
చెన్నూరు	18	72	1,080


అంతర్గత రహదారులు, మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో వీధుల్లోకి చేరుతున్న వరద

పురపాలికల్లో ప్రధాన సమస్యలివి

◆ సింహభాగం వార్డుల్లో పారిశుద్ధ్య పనులు వంద శాతం జరగడం లేదు

◆ మురుగు కాలువలు, సీసీ రహదారుల నిర్మాణాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ నాలాల ఆక్రమణలతో చిన్నపాటి వర్షాలకు లోతట్టుగా ఉన్న గృహాలు, వీధుల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది.

◆ వర్షాకాలంలో నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోతోంది. ఎక్కడా సంరక్షణ చర్యలు తీసుకోవడం లేదు.

◆ చాలా పట్టణాల్లో తాగు నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. మిషన్ భగీరథ నీరు కొన్ని పట్టణాలకే పరిమితమైంది.

◆ ప్లాస్టిక్ నిషేధంపై చైతన్యం కొరవడి ఎక్కడ చూసినా ఆ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి.

ప్రత్యేకదృష్టి అవసరం..

పట్టణాల్లో వార్డుకు నాలుగు కమిటీలను, ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులను ఎంపిక చేశారు. యువజన సంఘం, సీనియర్ సిటిజన్, మహిళా సంఘం, వార్డు ప్రముఖులతో కలిపి కమిటీని రూపొందించారు. వీరంతా వార్డుపై, వార్డుకు కావాల్సిన అవసరాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉన్నవారై ఉంటారని భావించి అలా నిర్ణయించారు. ప్రజలకు అధికారులకు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తూ స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత సభ్యులపై ఉంటుంది.

నిబంధనల ప్రకారం నిర్వహిస్తాం

గంగాధర్, పురపాలిక కమిషనర్, చెన్నూరు

పట్టణంలో అభివృద్ధి పనులను నిబంధనల ప్రకారం నిర్వహిస్తాం. పనుల్లో ఏదైనా సందేహం ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకొస్తే దానిపై చర్యలు చేపట్టేందుకు ప్రయత్నిస్తాం. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులకు ఉపక్రమిస్తాం. వార్డు కమిటీల సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు సాగుతాం.

స్కానింగ్ సారు.. సమయానికి రారు..



ఇది మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలోని గర్భిణుల స్కానింగ్ కేంద్రం. తొమ్మిది గంటలకు విధులకు రావాల్సిన రేడియాలజిస్టులు మంగళవారం 11.30 గంటలయినా రాలేదు. నిబంధనల ప్రకారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా విధుల్లో ఉండాలి. కానీ గంట కూడా ఉండటం లేదు.



స్కానింగ్ కేంద్రం వద్ద మంగళవారం ఉదయం కనిపించిన దృశ్యమిది. ఆయా సేవల కోసం నిత్యం గర్భిణులు ఇలా గంటల తరబడి నిలబడాల్సిందే. ఓపీ సేవల కోసం వచ్చిన ప్రతీసారి ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నామని బాధితులు వాపోతున్నారు. దూరప్రాంతాల నుంచి ఇబ్బంది పడుతూ వస్తున్నామని, వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో అవస్థల పాలవుతున్నామన్నారు.

● గర్భిణులకు కష్టాలు



దురుసు ప్రవర్తన..

మంచిర్యాల పట్టణానికి సంబంధించిన గర్భిణులకు తప్పితే మిగతా ఏ చోట నుంచి వచ్చినా స్కానింగ్ చేయమంటున్నారు. మంగళవారం ఈ పరిస్థితి ఇద్దరు గర్భిణులకు ఎదురైంది. లక్షెట్టిపేట, బెల్లంపల్లికి చెందిన మహిళలకు స్కానింగ్ చేయాల్సి వచ్చింది. ఇక్కడికి వస్తే స్కానింగ్ చేయకుండా తమ ప్రాంతాలకు వెళ్లమని పంపించివేశారు.

మంచిర్యాల వైద్యవిభాగం, న్యూస్‌టుడే

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో బాధితులకు స్కానింగ్ కష్టాలు తప్పడం లేదు. సమయానికి రాకపోవడం తోపాటు ఉన్న కొద్దిసేపట్లోనూ గర్భిణులతో దురుసుగా ప్రవర్తిస్తుంటారనే ఆరోపణలున్నాయి. లక్షెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూరు అంటూ బాధితులను విభజిస్తుంటారు. ఆసుపత్రి సమయం (ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 వరకు) తప్పనిసరి అందుబాటులో ఉండాలని పర్యవేక్షకులు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో పలువురు స్కానింగ్ కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతూ ప్రైవేటు బాటపడుతున్నారు. ఒక్కోసారి సమయానికి వచ్చినా.. బాధితులు ఎవరూ లేరంటూ తమ ప్రైవేటు కేంద్రాలకు వెళ్లిపోతున్నారు.

ఎస్ఆర్, డీఆర్‌పీలకు వదిలేస్తూ..

ప్రస్తుతం రేడియాలజీ విభాగానికి ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. వీరే స్కానింగ్‌కు సంబంధించిన సేవలందించాలి. కానీ ప్రస్తుతం ఒకరు సీనియర్ రెసిడెంట్, మరొకరు డీఆర్‌పీ(డిస్ట్రిక్ రెసిడెన్సీ ప్రోగ్రాం, ఈ విభాగంలో పీజీ చేస్తున్న విద్యార్థి)అందుబాటులో ఉండటంతో ఆయా సేవలన్నీ వీరికి వదిలేసి వెళ్లిపోతున్నారు. శిక్షణ పొందేందుకు వచ్చిన వారికి ఆయా విభాగం పని తీరును వివరించాల్సిందిపోయి వారితో పనిచేయించడం ఏంటని ఇప్పటికే పర్యవేక్షకులు అనేకసార్లు హెచ్చరించినట్లు తెలిసింది. అయినా అదేతీరుతో వ్యవహరిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే పనిభారం ఎక్కువ అవుతుందని, నియామకం చేపట్టాలంటూ సలహాలు ఇస్తున్నారని నిర్వాహకులు తెలుపుతున్నారు.

వైద్యులపై ఫిర్యాదు చేశాం

డా.హరిశ్చంద్రారెడ్డి, పర్యవేక్షణాధికారి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి



రేడియాలజిస్టుల తీరుతో బాధితుల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమయపాలన పాటించడం లేదని, తరచూ వారిపై ఫిర్యాదులు అందుతున్నాయి. హెచ్చరించినా తీరు మార్చుకోవడం లేదు. పీజీ, డీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగిస్తూ విధులకు సక్రమంగా రావడం లేదు. వీరికి ఆయా సేవలు పూర్తిగా అప్పగించడం సరికాదని చెప్పాం. సంబంధిత అంశంపై ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశాం.

ఎండకు వాలి.. తెగుళ్లతో హాని!

కన్నెపల్లి, న్యూస్‌టుడే: నెల రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో పత్తి చేన్లు ఎండకు వాలిపోతున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పత్తి పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. ఇప్పటికే ఇసుక నేలల్లో సాగు చేసిన పత్తి మొక్కలు చనిపోయాయి. పంట చేతికి వచ్చే సమయంలో వరుణ దేవుడు కనికరించకపోతే కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.


ఎండకు వాలిపోయిన పత్తి పంట


మంచిర్యాల మండలానికి సంబంధించి ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందిస్తున్న ఎంఈవో మాలవీదేవి

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. డీఎస్సీ 2024లో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 9న నియామక పత్రాలు అందజేయగా మంగళవారం రాత్రి వరకు పాఠశాలల కేటాయింపునకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. జిల్లాలోని ప్రభుత్వ, లోకల్‌బాడీ యాజమాన్యాల్లో ఆయా స్థానాలకు ఎంపికైన 230 మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయగా బుధవారం సంబంధిత ఉపాధ్యాయులు ఆయా మండలాల్లోని పాఠశాలల్లో విధుల్లో చేరారు. ఇటీవల బదిలీ అయి అదే పాఠశాలల్లో కొనసాగుతున్న ఉపాధ్యాయులు రిలీవ్ అయ్యారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని హన్మాన్‌బస్తీలో చెత్త పేరుకుపోతుంది. పందుల సంచారంతో చెత్తంతా రోడ్డు మీదకు వస్తుంది. - రమేశ్, హన్మాన్‌బస్తీ

✔ అన్ని వార్డుల్లో చెత్తను ప్రతిరోజు తొలగిస్తున్నాం. పందుల సంచారం లేకుండా చర్యలు తీసుకుంటాం. - వైకుంఠం, పారిశుద్ధ్య అధికారి

? పట్టణంలోని బజారుఏరియాలో రోడ్ల పక్కన ద్విచక్రవాహనాలు నిలపడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డు ఇరుకుగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. - రాజేశ్, బజారుఏరియా

✔ బజారుఏరియాలో రోడ్డుపై పార్కింగ్ చేస్తే జరిమానాలు విధిస్తున్నాం. కేసులు నమోదు చేస్తాం. - దేవయ్య, ఒకటో పట్టణ ఎస్‌హెచ్‌ఓ

స్పందించి.. పూడిక తీయించి

స్పందన

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: రామకృష్ణాపూర్ పట్టణంలోని స్థానిక రామాలయం చౌరస్తాలోని మురుగు కాలువలో చెత్త పేరుకుపోవడంతో మురుగు పారడం లేదు. కాలువ నిండి మురుగు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రయాణాల కోసం వచ్చే వారికి దుర్వాసనతో అవస్థలు తప్పడం లేదు. ఈ సమస్య శుక్రవారం 'మేమున్నాం మీకు తోడుగా'లో ప్రచురితం కాగా సింగరేణి సివిల్ అధికారులు స్పందించారు. సివిల్ డివైఎస్ఈ శ్రీధర్ వెంటనే స్పందించి కాలువలో పూడిక తీయాలని ఆదేశించారు. సిబ్బంది రెండు రోజులుగా శ్రమించి కాలువలో మురుగు పారేలా చర్యలు చేపట్టారు. సివిల్ జేఈ దేవి కుమార్, కౌన్సిలర్ మల్లయ్య, శానిటరీ సూపర్‌వైజర్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో గురుకులాలు

అంతంతమాత్రంగా వసతులు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అద్దె చెల్లించడం లేదని రాష్ట్రవ్యాప్తంగా వివిధ గురుకులాల భవనాలకు యజమానులు తాళాలు వేశారు. తొమ్మిది నెలల నుంచి అద్దె రావడం లేదంటూ వారు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. భవనాలకు తాళాలు వేయడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. కొన్ని చోట్ల తాళాలు వేసిన యజమానులపై కేసులు నమోదు చేసింది. జిల్లాలోనూ ప్రైవేటు భవనాల్లో అన్ని శాఖల గురుకులాలు కొనసాగుతున్నాయి. ప్రతి నెలా అద్దె చెల్లించడం ఆయా సంస్థలకు భారంగా పరిణమిస్తుంది. చాలా చోట్ల ప్రభుత్వ భూములున్నప్పటికీ సొంత భవనాలు మంజూరు కావడం లేదు. దీంతో అరకొర వసతుల మధ్య విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు.

విద్యార్థులకు నిత్యం ఇబ్బందులే

భవనాలకు అద్దె చెల్లిస్తున్న చాలా భవనాల్లో కనీస వసతులు లేకుండా పోతున్నాయి. సరిపడా నీళ్లు, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. గురుకులాల విద్యార్థులు ఆడుకోవడానికి మైదానాలు సైతం లేవు. దీంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. అరకొర వసతులతో విద్యార్థులు సరిపెట్టుకోవాల్సి వస్తుంది. చాలా గురుకులాల్లో మౌలిక వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల సంఖ్యకు అనుగుణంగా ఆయాలు లేకపోవడంతోనూ విద్యార్థులు, సిబ్బంది చాలా అవస్థలు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

సొసైటీలవారీగా గురుకులాలు	మొత్తం	అద్దె భవనాలు	సొంత భవనాలు
మైనార్టీ సంక్షేమ	4	4	0
సాంఘిక సంక్షేమ	10	5	5
బీసీ	7	5	2

బెల్లంపల్లిలో ప్రభుత్వ, సింగరేణి స్థలాలకు కొదువ లేదు. మైనార్టీ, బీసీ బాలుర గురుకులాలు రెండు ఉన్నాయి. మైనార్టీ గురుకులానికి కన్నాల జాతీయ రహదారి పక్కన గతంలో 5 ఎకరాల స్థలం కేటాయించి బోర్డు ఏర్పాటు చేశారు. భవన నిర్మాణానికి ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో ప్రైవేటు భవనంలో కొనసాగించాల్సి వస్తుంది. దీనికి నెలకు రూ.2.18 లక్షల అద్దె చెల్లిస్తున్నారు. బెల్లంపల్లిలోని మహాత్మా జ్యోతిబాపులే బాలుర గురుకుల పాఠశాల సైతం అద్దె భవనంలో కొనసాగుతుంది. ప్రభుత్వ భూములున్నప్పటికీ ఇప్పటి వరకు స్థలం గుర్తించలేకపోయారు. బెల్లంపల్లిలో కొనసాగుతున్న కాసిపేట సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతుంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ప్రభుత్వ భూములను ఆయా సొసైటీలకు అప్పగించి భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉంది.



బెల్లంపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాల



కలమడుగు పాఠశాలలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ కాటేపల్లి సత్యనారాయణరెడ్డి

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి: ఆర్‌జేడీ

జన్నారం, న్యూస్‌టుడే: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధన సాగాలని వరంగల్ రీజనల్ డైరెక్టర్ కాటేపల్లి సత్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని కలమడుగు ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. గత సంవత్సరంలో ఎస్ఎస్‌సీలో జిల్లాలో మొదటి స్థానం సాధించడంపై ప్రధానోపాధ్యాయుడు కట్ల రాజమౌళి, ఉపాధ్యాయులను అభినందించారు. మండల విద్యాధికారి ఎస్.విజయ్‌కుమార్, హెచ్‌ఎం రాజమౌళి, ఉపాధ్యాయులు రమేశ్, రాజేందర్, కవిత, సాగర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

హాజీపూర్, న్యూస్‌టుడే: మండలంలోని గుడిపేట పోలీసు పటాలంలో సిబ్బందికి ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు బుధవారం కొనసాగాయి. పరుగు పందెం పోటీలను కమాండెంట్ వెంకటరాముడు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం టగ్‌ఆఫ్‌వార్, క్రికెట్, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించారు. పటాలం అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, కాశిదాస్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాల ఎస్‌హెచ్‌ఓగా ప్రమోద్‌రావు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: జిల్లాలో ఇద్దరు సీఐలు బదిలీ అయ్యారు. మంచిర్యాల పట్టణ ఎస్‌హెచ్‌ఓగా రామగుండం కమిషనరేట్ పరిధిలో ఐటీ సెల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎస్.ప్రమోద్ రావును నియమించగా, శ్రీరాంపూర్ సర్కిల్ సీఐగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీసీఎస్ విభాగంలో పని చేస్తున్న వేణుచందర్‌ను నియమిస్తూ బుధవారం మల్టీ జోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా చోట్ల ప్రస్తుతం పనిచేస్తున్న ఆర్.బన్సీలాల్, డి.మోహన్‌లను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు.



ప్రమోద్‌రావు

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి మండలం దుబ్బపల్లి గ్రామానికి చెందిన మంచాల మహేష్(25) అనే యువకుడు మద్యం మత్తులో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తాళ్లగురిజాల ఎస్సై రమేష్ తెలిపారు. మహేష్ డిగ్రీ వరకు చదువుకుని స్థానికంగా మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. దసరా నుంచి అతిగా మద్యం తాగుతున్నాడు. తల్లిదండ్రులు ఇంట్లో లేకపోవడం, ఊరి నుంచి వస్తే మందలిస్తారనే భయంతో సోమవారం సాయంత్రం మద్యం మత్తులో పురుగు మందు తాగాడు. గమనించిన అతడి సోదరుడు సందీప్ స్థానికులకు సమాచారం ఇవ్వడంతో బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి మెరుగైన చికిత్సకు తరలించగా మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వాసుపత్రిలో పంచనామా నిర్వహించారు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



మహేష్

ఆర్థిక ఇబ్బందులతో రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

నాగోలు, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జన్నారం మండలం పొన్కల్ గ్రామానికి చెందిన సామ రోహిత్‌కుమార్(32) ఎల్బీనగర్ శ్రీశంకర్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. భార్య ప్రియాంక, ఆరేళ్ల పాప ఉన్నారు. గతంలో మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేశాడు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ చేస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంతకాలంగా ఎల్బీనగర్ సూర్యోదయనగర్‌లో అత్తగారింట్లో ఉంటున్నారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో బ్యాంక్‌కు వెళ్తున్నానని చెప్పి శ్రీశంకర్‌నగర్‌లో వారుండే ఇంటికి వెళ్లాడు. అనంతరం ఫోను స్విచ్ఛాఫ్ చేశాడు. భార్య శ్రీశంకర్‌నగర్‌లోని ఇంటికి రాగా సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకొని కనిపించాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కన్నెపల్లి, న్యూస్‌టుడే: సాలిగాంలో మంగళవారం గోమాస నరేందర్‌ను హత్య చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను బుధవారం అరెస్ట్ చేసినట్లు తాండూర్ సర్కిల్ సీఐ కుమార స్వామి తెలిపారు. మృతుడి మామ గోలేటి శంకర్, అత్త లక్ష్మి, భార్య భవాని(బేబి) ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి బెల్లంపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా వారికి జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఇంకా ఎవరికైనా హత్యలో భాగస్వామ్యం ఉందా అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యార్థికి అభినందన

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు అలవాటుపడకుండా, వారిని సన్మార్గంలో నడిపించే లక్ష్యంతో కోచ్ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల పలువురు విద్యార్థులతో పర్వతారోహణ కార్యక్రమం చేపట్టారు. మంచిర్యాల పట్టణం జాఫర్‌నగర్‌కు చెందిన తౌటం వీరజ్ అనే విద్యార్థి హిమాచల్ ప్రదేశ్‌లోని 14600 అడుగుల ఎత్తుగల మౌంట్ పతల్స్ పర్వతాన్ని అధిరోహించినందుకు పురపాలక సంఘం అధ్యక్షుడు రావుల ఉప్పలయ్య, పుర కమిషనర్ మారుతీ ప్రసాద్‌లు బుధవారం పుర కార్యాలయంలో అతడిని సన్మానించారు. సాహసోపేత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని యువతకు సూచించారు.



విద్యార్థిని అభినందిస్తున్న పుర ఛైర్మన్ ఉప్పలయ్య, కమిషనర్ మారుతీప్రసాద్

ఈ-పాస్ విధానాన్ని అమలు చేయాలి

హాజీపూర్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎరువుల వ్యాపారులు రైతులకు విక్రయించే ఎరువులు, విత్తనాల వివరాలను ఎప్పటికప్పుడు ఈ-పాస్ యంత్రం ద్వారా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిణి కల్పన అన్నారు. బుధవారం మండలంలోని గుడిపేట రైతువేదికలో మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాలకు చెందిన ఎరువుల వ్యాపారులు, మండల వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎరువులు విక్రయించే క్రమంలో ప్రతి రైతు వివరాలను ఎమ్ఎఫ్ఎమ్ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నెన్నెల, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లపల్లి గ్రామం నుంచి అక్రమంగా ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నట్లు గ్రామస్థుడు జనార్దన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆర్ఐ సులోచన ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. దీన్ని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. గొల్లపల్లి నుంచి అదే సమయంలో గ్రామంలో పలుకుబడి ఉన్న మరో వ్యక్తి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నా.. వదిలేశారని ఆ గ్రామస్థులు ఆరోపించారు.

మత్తడి ధ్వంసం కేసులో దోషులను శిక్షించాలి

చెన్నూరు, న్యూస్‌టుడే : చెన్నూరు పట్టణంలో ఇటీవల జరిగిన శనిక్కుంట మత్తడి పేల్చివేత ఘటనకు సంబంధించిన కేసులో అసలు దోషులను చట్టపరంగా శిక్షించాలని కోరుతూ భారాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజారమేశ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. చెన్నూరు మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్లు అనిల్, రమేశ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

నెన్నెల: మండలంలోని గొల్లపల్లిలో ఇటీవల నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ బుధవారం విచారణ చేశారు. పొన్నాల వెంకటస్వామిని అదే గ్రామానికి చెందిన వెల్పుల రాజం అనే వ్యక్తి కులం పేరుతో దూషించారనే ఫిర్యాదుపై విచారణ చేసినట్లు ఏసీపీ తెలిపారు.

ఆఫర్లు చూసి.. పెట్టుబడులు పెట్టి

ఉపాధ్యాయులే లక్ష్యంగా మోసం

జన్నారం, న్యూస్‌టుడే: 'మీరు పెట్టిన పెట్టు'బడి' సంవత్సరంలోనే రెండింతలవుతుంది. అంతేకాదండీ మీరు కొనుగోలు చేసిన భూమికి తిరిగి డబ్బులు సైతం అందుకుంటారు. ఏడాదిలో కోటీశ్వర్లు కాబోతున్నారు. సర్వీస్ మొత్తం పూర్తి చేసినా చేతికి అందనంత సొమ్ము ఏడాదిలోనే అందుకోబోతున్నారు'. ఇంకేముంది ఈ ఆఫర్లు చూసి ఒకరి తరువాత ఒకరు పెట్టుబడుల ప్రవాహం కొనసాగించారు. ఇప్పుడు మోసపోయామని లబోదిబో మొత్తుకుంటున్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వ్యాపారులు, నిరుద్యోగులు రియల్ ఎస్టేట్‌వైపు అడుగులు వేశారు. ఒక ప్లాట్ ధర రూ. 15 లక్షలు ఉంటుంది. కొందరు రెండు, మూడు, నాలుగు ప్లాట్లను బుక్ చేసుకున్నారు. సహచర ఉద్యోగిని నమ్మి మండలంలోని ఓ పాఠశాల ఉపాధ్యాయుడు ఏకంగా రూ.52 లక్షలు సమర్పించుకున్నాడు. అతనికి ప్లాట్ రాలేదు, డబ్బులు అందలేదు. మోసపోయానని తెలిసి సదరు వ్యక్తిని నిలదీస్తే తానూ మోసపోయానని సమాధానం ఇస్తున్నాడని బాధితులు వాపోతున్నారు. వందల సంఖ్యలో ఉన్న బాధితులు ఇప్పటికే పోలీస్ ఠాణాల్లో ఫిర్యాదులు చేసినట్లుగా తెలుస్తోంది. జన్నారం మండలానికి చెందిన వ్యక్తితో పాటు అతని సమీప బంధువు దండేపల్లి మండలానికి చెందిన మరో వ్యక్తి కలిసి ఈ తతంగం మొత్తం నడిపించినట్లుగా బాధితులు వాపోతున్నారు. జనగామా జిల్లాలో ఉన్న భూముల కొనుగోలు కోసం పెట్టుబడి పెట్టించారని కొంత సొమ్మును ఆ ఇద్దరే తమ సొంత బ్యాంకు ఖాతాల్లో జమచేసుకున్నట్లుగా బాధిత ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఇటీవల నిర్మల్ జిల్లాలో జరిగిన బిట్ కాయిన్ బాగోతం మరిచిపోక ముందే మంచిర్యాల జిల్లాలోనూ అదే తరహాలో మోసపోయిన ఘటన ఇప్పుడు జన్నారం మండలంలో సంచలనం రేపుతోంది. నేడో, రేపో రామగుండం పోలీస్ కమిషనర్ వద్దకు బాధితులంతా కలిసి వెళ్లనున్నట్లుగా సమాచారం.

దరఖాస్తుల ఆహ్వానం

ఏసీసీ, న్యూస్‌టుడే: విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పోటు రవీందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యానిధి ఉపకార వేతనాలకు ఆన్‌లైన్‌లో ఈ నెల 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.



విద్యార్థులతో జీఎం బి.సంజీవరెడ్డి, అధికారులు

విద్యార్థులకు అండగా అధికారులు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సీసీసీలోని సింగరేణి పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు శ్రీరాంపూర్ పర్సనల్ విభాగం అధికారులు అండగా నిలిచారు. డీజీఎం(పీ) అరవిందరావు ఆధ్వర్యంలో అధికారుల నుంచి సేకరించిన రూ.10 వేల మొత్తంతో పుస్తకాలు, ఇతర సామగ్రి కొనుగోలు చేశారు. బుధవారం జీఎం కార్యాలయంలో జీఎం బి.సంజీవరెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, అరవిందరావు, రాజేశ్వర్, రాజేష్ పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సంస్థలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని భాజపా జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేశారు. బుధవారం శ్రీరాంపూర్ ఉపరితల గనిలోని జీవీఆర్ గుత్తేదారు సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. సంస్థ లాభాల్లో రూ.5 వేలు కొంత మందికే చెల్లించారని, మిగతా వారికి వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులందరి పీఎఫ్ కట్ చేయాలని పేర్కొన్నారు. కె.చక్రవర్తి, సదానందం, మల్లేష్, అన్వేష్‌రెడ్డి, ప్రవీణ్, సుజిత్ పాల్గొన్నారు.

ఎంవీ డ్రైవర్ ఉద్యోగాలు భర్తీ చేయాలి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సంస్థలో ఖాళీగా ఉన్న ఎంవీ డ్రైవర్ ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మాట్లాడుతూ అంతర్గత అభ్యర్థుల కోసం 94 ఉద్యోగాల భర్తీకి 2021లో యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేసిందన్నారు. కరోనా కారణం చూపుతూ వాయిదా వేసిందని తెలిపారు. ఏళ్ల తరబడి ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో ప్రస్తుత ఎంవీ డ్రైవర్లు పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, బండి రమేష్, పానుగంటి సత్తయ్య, పి.రమేష్, అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రణాళిక లోపంతో ఓసీ మూసివేత'

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : సరైన ప్రణాళిక లేకపోవడంతోనే మందమర్రి ఏరియా ఆర్కేపీ ఓసీ మూసివేయడం జరుగుతుందని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఓసీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.



ఉద్యోగులకు వెబ్ కౌన్సెలింగ్

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: భూగర్భ గనుల నుంచి ఉపరితల గనులకు వెళ్లేందుకు ఉద్యోగులకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని గనుల వృత్తి శిక్షణ కేంద్రంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల నుంచి 71 మంది ఓవర్ మెన్, హెడ్ ఓవర్‌మెన్‌లు పాల్గొన్నారు. వీరిలో 42 మంది ఉద్యోగాలు ఎంపిక చేసుకొన్నట్లు ఎస్ఓటు జీఎం ఎన్.సత్యనారాయణ తెలిపారు. డీజీఎం(పీ) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఎంవీటీసీ మేనేజర్ రామారావు, రాజేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

శబరిమలకు కాలినడకన భక్తులు

నస్పూర్: శ్రీరాంపూర్‌కు చెందిన అయ్యప్ప భక్తులు ఐలయ్య, రామకృష్ణులు బుధవారం శబరిమలకు పాదయాత్ర ద్వారా శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయం నుంచి బయలుదేరారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రావు పాదయాత్రను ప్రారంభించారు. నరహరి, రాజేశం, సురేందర్ పాల్గొన్నారు.

సమగ్ర కులగణనకు జీవో విడుదల చేయడం హర్షణీయం

జన్నారం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేయడానికి ప్రభుత్వం జీవో విడుదల చేయడం హర్షణీయమని బీసీ సంఘాల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జ్యోతిబాపులే చిత్రపటానికి పూలాభిషేకం చేశారు. కులగణన అనంతరం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘాల నాయకులు కడార్ల నర్సయ్య, కోడూరి చంద్రయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

18న జిల్లాస్థాయి బాలబాలికల క్రికెట్ ఎంపిక పోటీలు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఈ నెల 18న జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాలబాలికల విభాగంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 01-01-2008 తర్వాత జన్మించినవారు అర్హులని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు బోనాఫైడ్, ఆధార్‌కార్డు పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభించినట్లు, సొంత క్రికెట్ కిట్ తెచ్చుకోవాలని చెప్పారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని వెరబెల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రఘునాథ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏథిక్ అకాడమీ పాఠశాల ఆవరణలో హెటిరో సంస్థ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు స్పందన లభించింది. హాజరైన నిరుద్యోగ యువతకు పరీక్ష నిర్వహించి 14 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ చరణ్‌రెడ్డి ఉన్నారు.

పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోండి

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బ్యాడ్మింటన్ అకాడమీ, పాఠశాలల్లో సంబంధిత అంశంపై అవగాహన కల్పించారు. అశ్విన్, సతీష్‌రావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నరేందర్

భీమారం: పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భీమారం మండలంలోని నర్సింగాపూర్(బీ) ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించే గుడిమల్ల నరేందర్ నియమితులయ్యారు. ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించిన పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలలో నిర్వహించిన ఎన్నికల ఫలితాలను బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డిలు ప్రకటించారు.

పంట నష్టపరిహారం అందించాలి

వేమనపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం ఇప్పించాలని భారాస మండల అధ్యక్షుడు వేణుమాధవ్ బుధవారం తహసీల్దార్‌కు అందజేశారు. సింగిల్‌విండో ఛైర్మన్ వెంకటేశం, నాయకులు లక్ష్మీకాంత్, కొండగొర్ల బాపు పాల్గొన్నారు.

మహారాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు

చెన్నూరు: మహారాష్ట్రలో త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో సరిహద్దులోని కోటపల్లి మండలం అర్జునగుట్ట వద్ద పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. తెలంగాణ నుంచి మహారాష్ట్ర వైపు మద్యం, నగదు తరలకుండా తనిఖీలను ముమ్మరం చేశారు. చెక్‌పోస్టును ఎస్సై రాజేందర్ బుధవారం పరిశీలించారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవని పుర కమిషనర్ మురళి కృష్ణ అన్నారు. బుధవారం పురపాలిక ఆధ్వర్యంలో క్యాతనపల్లి పురపరిధిలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కిరాణాలు, మద్యం దుకాణాల్లో మొత్తం కలిపి రూ.9,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

బీసీ కులగణనపై హర్షం

మందమర్రి పట్టణం: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో బీసీ కుల గణన చేపడుతున్న నేపథ్యంలో బుధవారం మందమర్రి జాతీయ బీసీ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆ సంఘం అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బెల్లంపల్లి పట్టణం: పట్టణంలోని అభివృద్ధి పనులకు బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్వేత శంకుస్థాపన చేశారు. 11వ వార్డులో గొంతెమ్మ గుట్ట నుంచి పోచమ్మ చెరువు వరకు రూ.5 లక్షలతో సీసీరోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. 10, 28 వార్డుల్లో రూ.3 లక్షల డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. 20వ వార్డులో రూ.3 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకుశంకుస్థాపన చేశారు.



పవర్ ప్లాంట్ ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

పవర్ ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించాలి

ఏసీసీ: పాతమంచిర్యాలలో మూసివేసిన శాలివాహన బయోమాస్ పవర్‌ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించాలని పవర్ ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం పవర్‌ప్లాంట్ ముందు కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్, ఐటీహబ్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో 20 నెలలుగా మూతపడ్డ పవర్‌ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించాలన్నారు. శ్రీనివాస్, సత్యం, రవిశంకర్, రాజయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

భీమిని, న్యూస్‌టుడే: మహనీయుల అడుగుజాడల్లో నడవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. బుధవారం భీమిని మండలం కేస్లాపూర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ చేశారు. చిన్నగుడిపేట, కేస్లాపూర్, చిన్నతిమ్మాపూర్ గ్రామ పంచాయతీల్లో సమస్యలు తీరుస్తామన్నారు. కేస్లాపూర్ దగ్గరలో రోడ్ డ్యాం చెదిరిపోయి గుంతలు ఏర్పడింది. వంతెన నిర్మించడానికి కృషి చేస్తామని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏమాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, మాజీ ఎంపీపీ రాజేశ్వరి, మజీ జడ్పీటీసీ సభ్యురాలు గంగక్క పాల్గొన్నారు.

అంతర్జాతీయ వైద్య సదస్సుకు ఆహ్వానం

మంచిర్యాల వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని టచ్ హాస్పిటల్‌లో గుండె వైద్య నిపుణుడిగా సేవలందిస్తున్న రాజేష్ వి బోర్కుండేకు అరుదైన గౌరవం దక్కింది. సంబంధిత నిపుణుల నుంచి అంతర్జాతీయ వైద్య సదస్సుకు ఆహ్వానం అందిందని బుధవారం ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. వచ్చే సంవత్సరం దుబాయ్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. కార్డియాలజీ విభాగంలో చేసిన పరిశోధనకుగాను స్పీకర్‌గా దేశం నుంచి ఎంపికయ్యారన్నారు.



రాజేష్

కేంద్ర ప్రభుత్వ నిధుల ఖర్చులపై ఆరా

భీమారం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామపంచాయతీలలో చేపట్టిన ఖర్చులపై నేషనల్ లెవల్ మానిటరింగ్ (ఎన్ఎల్ఎం) బృంద సభ్యులు వివరాలను సేకరిస్తున్నారు. బుధవారం జైపూర్ మండలంలోని టేకుమట్ల గ్రామంలో ఎన్ఎల్ఎం సభ్యులు కేహెచ్ సునీల్, సీవీ బాలమురళి పర్యటించారు. ఉపాధి హామీ పథకం, గ్రామ పంచాయతీ క్యాష్‌బుక్స్, పెన్షన్లు, అంత్యోదయ, వాత్సల్య పథకాల అమలు తీరుపై మండల అధికారులు, గ్రామ ప్రజల నుంచి వివరాలను సేకరించారు. ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో బాపురావ్, ఏపీడీ సదానందం, ఐకేపీ ఏపీయం రాజ్‌కుమార్, ఏపీవో వెంకటేశ్వర్లు, ఈజీఎస్ టీఏలు పాల్గొన్నారు.



భీమారంలో వివరాలు సేకరిస్తున్న సభ్యులు

హాజీపూర్, న్యూస్‌టుడే: మండలంలోని వేంపల్లిలో ఉపాధిహామీ పథకం, పించన్లు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, రహదారులు, పంచాయతీల ద్వారా చేసిన పనుల రికార్డులను కేంద్ర ప్రభుత్వ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉపాధిహామీ కూలీలు, మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను పరిశీలించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి కిషన్, నోడల్ అధికారి సదానందం, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో ఉమర్ షరీఫ్ పాల్గొన్నారు.

అలరించిన కళా ఉత్సవ్

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: వివిధ కళల్లో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహించిన కళా ఉత్సవ్-2024 జిల్లాస్థాయి పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని సైన్సు కేంద్రంలో జిల్లా సమన్వయకర్త సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మండలస్థాయిలో గెలుపొందిన విజేతలకు బుధవారం నృత్యం, వాయిద్యం తదితర పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలు ప్రసాద్, సంతోష్‌కుమార్, సునిత, నారాయణరావు, శాంకరి, అర్జున్, విద్యార్థులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థిని

ఫీజు బకాయిలు విడుదల చేయాలని నిరసన

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయాలని బుధవారం జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాలు, ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక ఐబీ చౌరస్తా నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీగా వచ్చి బెల్లంపల్లి చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. డిగ్రీ కళాశాలల నిర్వాహకులు మాట్లాడుతూ మూడేళ్లుగా రావాల్సిన ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో బడ్జెట్ కళాశాలలు నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాలీకి ట్రస్మా నాయకులు మద్దతు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు నర్సయ్య, చంద్రమోహన్, మల్లయ్య, ముఖేష్, భూమేష్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాలు, ప్రైవేటు డిగ్రీ కళాశాలల నిర్వాహకులు

ఈ సందర్భం ఓ మధుర జ్ఞాపకం..!!

● కొలువులో చేరిన కొత్త ఉపాధ్యాయులు



మామడ, న్యూస్‌టుడే: ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే మాటలు కాదు. తీవ్రమైన పోటీలో తమ ప్రతిభతో వేలాది మంది కన్నా ముందు నిలిచినే కోరుకున్న కొలువు సొంతమవుతుంది. అందులోనూ గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరే అవకాశం వస్తే అంతకన్నా ఆనందం ఇంకేముంటుంది. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో గురువులుగా ఎంపికైన వారు బుధవారం విధుల్లో చేరారు. టీచర్లుగా తొలిరోజు వారికి జీవితంలో ఎప్పటికీ గుర్తుండి పోయే మధుర జ్ఞాపకం. నూతనంగా బాధ్యతల్లో చేరిన పలువురు తమ అనుభూతులను ఇలా పంచుకున్నారు..

ఈ స్వాగతం చిరస్మరణీయం..



మామడ పాఠశాలలో సురేష్ పవార్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు

ఎవరికైనా బడితో అనుబంధం ఎంతో మధురంగా ఉంటుంది. అందుకే ఉన్నత స్థానాలు చేరుకున్నా తాము చదువుకున్న పాఠశాలకు వీలైనప్పుడల్లా వెళ్లుతూరు. ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి నిత్యం మళ్లీ విద్యార్థి దశ గుర్తొస్తుందన్న అభిప్రాయాన్ని మామడ జడ్పీఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన కుంటాల మండలం అంబుగామకు చెందిన సురేష్ పవార్ వ్యక్తం చేశారు. మొదటి రోజు బడికి వచ్చిన నాకు తోటి ఉపాధ్యాయులు చెప్పిన స్వాగతం, ప్రభుత్వ కొలువు సాధించి హాజరు రిజిస్టర్‌లో చేసిన సంతకం అంతా ఓ కొత్త అనుభూతినిచ్చిందని సురేష్ సంబరపడ్డారు.

ఉన్న ఊరిలోనే ఉపాధ్యాయురాలిగా..



పొన్కల్ పాఠశాలలో పిల్లలతో మౌనిక

దస్తురాబాద్ మండలం మున్యాల్‌కు చెందిన మౌనిక మామడ మండలం పొన్కల్‌కు చెందిన హరీష్‌ను వివాహం చేసుకున్నారు. డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికైన ఆమెకు మెట్టినిల్లైన పొన్కల్‌లోనే ఉపాధ్యాయురాలిగా పనిచేసే అవకాశం వచ్చింది. తొలి రోజు విధుల్లో చేరిన నాకు పిల్లలు పాఠాలు చెప్పడం, సహచర ఉపాధ్యాయులను కలవడం కొత్త అనుభూతినిచ్చిందన్నారు. ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు చక్కగా చదువు చెప్పి మంచి పేరు తెచ్చుకుంటానని ఆనందం వ్యక్తం చేశారు.

అమ్మానాన్నల దగ్గరే ఉండి మళ్లీ బడికి..

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం కేశాపూర్‌కు చెందిన లక్ష్మీ-గంగాధర్ దంపతుల కుమార్తె దివ్యరాణి. ఈమెకు నిర్మల్ మండలం నీలాయిపేటకు చెందిన మహేష్‌తో వివాహమైంది. అప్పటి నుంచి ఆ గ్రామంలోనే ఉంటున్నారు. ఇటీవల ఉపాధ్యాయురాలిగా ఎంపికైన దివ్యరాణికి సొంత జిల్లా జగిత్యాలలో పోస్టింగ్ వచ్చింది. సహజంగా చిన్నప్పుడు అమ్మానాన్నల దగ్గరుండి పిల్లలు బడికెళ్తుంటారు. ఇప్పుడు మళ్లీ తల్లిదండ్రుల దగ్గరుండి పాఠశాలకు వెళ్లే అవకాశం రావడం అదృష్టమని అభిప్రాయపడ్డారు. సొంతూరు కేశాపూర్‌కు సమీపంలోనే ఎర్దండి ప్రాథమిక పాఠశాలలో ఆమె విధుల్లో చేరారు. గురువుగా అంకిత భావంతో పని చేస్తానని, పిల్లలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానన్నారు. ఒక ఉపాధ్యాయురాలిగా తొలిరోజు ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు.



విధుల్లో చేరే ముందు తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న దివ్యరాణి

మొన్నటి దాకా నిరుద్యోగులు..

జీవితంలో ఎత్తుపల్లాలు సహజం. ఉద్యోగం లేక చిన్నాచితక పనులు చేసుకుంటూ నిరుద్యోగులుగా ఎన్నో కష్టాలు పడ్డ వారు ఉద్యోగులుగా మారిన క్షణాన్ని ఎలా మరిచి పోగలరు. ఓ కొత్త జీవితానికి నాంది పలికిన సందర్భం ఎంతో ప్రత్యేకంగా నిలుస్తుంది. ప్రణాళిక, పట్టుదల, క్రమశిక్షణతో అడుగులు వేసే వారికి ఆలస్యంగానైనా మంచి ఫలితాలు వస్తాయని యువత తమ ప్రతిభతో నిరూపిస్తున్నారు.

నేనే మీ ఊరి కొత్త టీచర్ను..

నిర్మల్‌కు చెందిన అభిలాష్ ఇన్నాళ్లూ మామడ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. తాజాగా ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఆయనకు పెంబి మండలం అంకెన గ్రామపంచాయతీ పరిధిలోని బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాలను కేటాయించారు. మొదటి రోజు ఆ ఊరికి వెళ్లిన అభిలాష్ గ్రామస్థులను కలిశారు. పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అనుభవంతో పాఠశాలలను చక్కగా తీర్చిదిద్దుతానన్నారు. సమాజంలో గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరడం అదృష్టంగా భావిస్తున్నానని అభిప్రాయపడ్డారు. జీవితంలో ఇది గుర్తుండి పోయే రోజని ఆనందం వ్యక్తం చేశారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న అభిలాష్

ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతా..

మామడ మండలం గొండుగూడకు చెందిన మోహన్ తానూరు మండలం ఝరి తండా పాఠశాలలో బాధ్యతలు తీసుకున్నారు. సొంతూరులో మొదటి ప్రభుత్వ ఉద్యోగిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. మారుమూల తండా పాఠశాలలో పనిచేసే అవకాశం వచ్చిందని, బాధ్యతలు చక్కగా నిర్వర్తించి అక్కడి పిల్లలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతానన్నారు. ఇన్నాళ్లూ నిరుద్యోగిగా ఎంతో కష్టపడ్డాను..ఇప్పుడు ఉపాధ్యాయునిగా ఇష్టంగా పని చేసి మంచి పేరు తెచ్చుకుంటానని చెప్పారు. కొత్తగా విధుల్లో చేరిన సందర్భంలో ఆనందబాష్పాలు వచ్చాయని ఈ రోజు ఎంతో ప్రత్యేకంగా నిలిచి పోతుందన్నారు.



ఝరి పాఠశాలలో తొలిరోజు విద్యార్థులకు పాఠం చెబుతున్న మోహన్

హత్య కేసులో 16 మందికి జీవిత ఖైదు, జరిమానా

రెబ్బెన, న్యూస్‌టుడే: కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం సింగిల్‌గూడ గ్రామానికి చెందిన ఆజ్మీర రమేష్ హత్యకు కారణమైన 16 మందికి జీవిత ఖైదు, రూ.1,49,000 జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ డి.వి శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం.. 2020 ఆగస్టు 19న రమేష్ సోదరి రాజేశ్వరి తన ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన జర్పుల సురేష్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో సోదరుడు రమేష్, ఆయన కుమారుడు లోకేష్ ఇంటి నుంచి బయటకు రావడంతో సదరు వ్యక్తి పారిపోయాడు. అనంతరం రమేష్ ఇతర పనులకు బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో.. విషయాన్ని మనసులో పెట్టుకున్న సురేష్ 15 మందితో కలిసి వెంట తెచ్చుకున్న గొడ్డలితో రమేష్‌ను తలపై నరికారు. మిగిలిన వారు రాజేశ్వరి, భార్య రేణుకలపై కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ రమేష్ మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈ ఘటనపై అప్పటి రెబ్బెన ఎస్సై డి.రమేష్ మొదటి ఇన్వెస్టిగేషన్ అధికారిగా నియామకమయ్యారు. జర్పుల సురేష్, జర్పుల సత్యవతి, ఆజ్మీర వసంత్ రావు, జర్పుల తిక్యానాయక్, జర్పుల హరీశ్, ఆజ్మీర అరవింద్, ఆజ్మీర నవీన్, ఆజ్మీర ప్రవీణ్, ఆజ్మీర సంతోష్, ప్రవీణ్‌కుమార్, జర్పుల లక్ష్మి, జర్పుల రజిత, జర్పుల తుకారం, జర్పుల రవి, జర్పుల రాజు, జర్పుల బిక్యానాయక్‌లపై మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఆసిఫాబాద్ లైజనింగ్ అధికారి (ఏఎస్సై) రామ్‌సింగ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ ఉమేశ్వర్ కోర్టులో 16 మంది నిందితులను ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్‌మోహన్‌రావు వాదించారు. న్యాయమూర్తి జి.వి రమేష్ శిక్ష విధించినట్లు ఎస్పీ వివరించారు.

ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో ఆదిలాబాద్‌కు చెందిన జమీల్‌ఖాన్(25)కు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.7 వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ పోక్సో కోర్టు బుధవారం తీర్పును వెలువరించింది. లైజన్ అధికారి జి.పండరి వివరాల మేరకు. . పట్టణంలోని ఒక కాలనీకి చెందిన బాలికకు, ఆమె తమ్ముడికి చదువు చెప్పే జమీల్‌ఖాన్ తన ఇంట్లో శుభకార్యం ఉందని చెప్పి 2021 ఫిబ్రవరి 14న సాయంత్రం 5.30కు బాలికను, ఆమె తమ్ముడి(4)ని ఇంటికి తీసుకెళ్లాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై వారిని దిగబెట్టడానికి బయలుదేరి మధ్యలో వాహనాన్ని ఆపి బాధితురాలి తమ్ముడికి చరవాణి ఇచ్చి బాలికను పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. తరువాత వారిని ఇంటి వద్ద దింపగా బాలిక ఏడుస్తూ విషయాన్ని తల్లికి చెప్పింది. వారు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రామకృష్ణ కేసును నమోదు చేశారు. ఈ కేసులో కోర్టు విధుల పోలీసు అధికారి ఠాకూర్ రవీందర్‌సింగ్ ప్రవేశపెట్టిన 14 మంది సాక్షులను ప్రత్యేక పీపీ విచారించి నేరాన్ని రుజువు చేశారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.శివరాంప్రసాద్ పైమేరకు తీర్పునిచ్చారు.

దివ్యాంగుడిపై లైంగిక దాడి

ఇచ్చోడ, న్యూస్‌టుడే : దివ్యాంగుడిపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన యువకుడు(20) ఈ నెల 13న రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన దివ్యాంగుడిని(32) పక్కనే ఉన్న పంట పొలానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుడికి రక్తస్రావం కావడంతో గమనించి కుటుంబ సభ్యులు ఆరా తీశారు. విషయం తెలియడంతో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాసరలో గంగాహారతి

ముథోల్(బాసర): దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం బాసర గోదావరి నది వద్ద గంగాహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేకపూజలు చేసిన అనంతరం గోదావరి నదికి హారతి ఇచ్చారు. బాసర గ్రామస్థులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో గోదావరి నది వద్ద భక్తుల సందడి కనపించింది. కార్యక్రమంలో ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ విజయరామారావు, వేదపండితులు పాల్గొన్నారు.




గోదావరినదికి హారతి ఇస్తున్న అర్చకులు

ఆత్మగౌరవానికి ప్రతీక.. కుమురం భీం

● నేడు జోడేఘాట్‌లో వర్ధంతి

ఈనాడు, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే, కెరమెరి

అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్‌లో పుట్టి ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన కుమురం భీం.. జీవితం, పోరాటం అడుగడుగునా వీరోచితం. వనాలతో మమేకమైన బతుకులతో ఆటలాడుతున్న నిజాం సైన్యానికి నూనుగు మీసాల వయసులోనే వెన్నులో వణుకు పుట్టించిన గోండు బెబ్బులి. గెరిల్లా పోరాటాల్లో తోటి వారికి తర్ఫీదునిచ్చి గ్రామాలను ఒక్కటిగా చేసి నిజాం గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన వీరుడు. నమ్మక ద్రోహ చర్యలో అసువులు బాసిన ఆయనను మరోసారి స్మరించుకునేందుకు ప్రజలందరి అడుగులు గురువారం (17న) జోడేఘాట్ వైపే సాగనున్నాయి.



తుపాకీ శిక్షణ కోసం

అధికారి మరణంతో ఆదివాసీలపై అధికారుల నిర్బంధం ఎక్కువయ్యాయి. చదువు లేకపోవడంతో జరిగే అనర్థాలు తెలుసుకున్న భీం.. ఈక్రమంలో జల్, జంగల్, జమీన్ లక్ష్య సాధనలో చదువుతో పాటు తుపాకీ పేల్చడం నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. 1935లో కోవ అర్జు, మడావి కొద్దు, కుమ్ర లచ్చులతో కలిసి అసోం ప్రాంతానికి వెళ్లారు. తుపాకీ వాడకం నేర్చుకుని మూడేళ్ల తర్వాత తిరిగి సొంత ప్రాంతానికి వచ్చారు.

తుడుం మోగించి.. ఒక్కటి చేసి



జోడేఘాట్‌కు వెళ్లే దారి

సాగు భూములపై హక్కులతో పాటు, పన్నుల రద్దు గురించి భీం 1938 నుంచి పోరాటం ఉద్ధృతం చేశారు. నిజాం తాలుకాదార్ అబ్దుల్ సత్తార్ (అప్పటి కలెక్టర్)తో నిర్వహించిన చర్చలు విఫలం కావడంతో.. ఉద్యమం క్రమంగా సాయుధ పోరాటంగా మారింది. ఈక్రమంలో కెరమెరి మండలంలోని టోకెన్ మోవాడ్, లైన్‌పటార్, బాబేఝరి, శివగూడ, పిట్టగూడ, కల్లెగాం, పట్నాపూర్, చాల్‌బడి, పాటగూడ, చిన్న పట్నాపూర్, గోండుగూడ, కొపగూడ గ్రామాల్లోని ప్రజలందరినీ ఏకం చేశారు. తుడుం మోగించి జోడేఘాట్ వద్ద సమావేశపర్చేవారు. వీరి సహకారంతో పోరు సాగుతున్న తరుణంలో ఆయనను ఎలాగైనా అణచివేయాలని నిజాం పోలీసులను రంగంలో దించారు. కుర్దు పటేల్ అనే నమ్మక ద్రోహి ఇచ్చిన సమాచారంతో భీం ఉన్న స్థలాన్ని పసిగట్టి కాల్పులు జరపగా.. 1940న తుదిశ్వాస విడిచారు.

పోరాటం వైపు పయనం..

ప్రస్తుత కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం పాత రౌట సంకెపల్లిలో 1900 అక్టోబరు 22న మైనుబాయి-చిన్ను దంపతులకు కుమురం భీం జన్మించారు. చిరుప్రాయంలోనే తండ్రి చనిపోవడంతో కుటుంబం సుర్దాపూర్ ప్రాంతానికి వలస వెళ్లింది. అటవీ పుత్రులైన గిరిజనులపై ఆ సమయంలో నిజాం ప్రభువు రకరకాల పన్నులు వసూలు చేసేవారు. దీనిపై వారిలో అసహనం వ్యక్తమైనా ఎవరై ధైర్యం చేయలేని పరిస్థితులు. భీం సాగు చేసిన పంట చేతికొచ్చిన తరుణంలో పంటను కాజేయడానికి అటవీ అధికారి సిద్ధిక్ రాగా.. వారిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అధికారిని కర్రతో కొట్టి చంపిన భీంకు 15 ఏళ్లు ఉండటం గమనార్హం. ఇదే ఆయన పోరాటానికి ఆరంభం.





మ్యూజియం

గిరిజన ప్రగతికి సంస్కరణలు..

భీం ప్రాణత్యాగంతో కళ్లు తెరిచిన నిజాం ఆదివాసీల అభ్యున్నతి కోసం సంస్కరణలు చేపట్టారు. ప్రఖ్యాత మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్ డార్ఫ్‌ను నియమించింది. గిరిజనులతో ఆయన మమేకమై వారి స్థితిగతులపై అధ్యయనం చేసి, అభివృద్ధికి మార్గనిర్దేశనం చేశారు. ఆయన సూచనలతోనే అటవీ భూమిని రెవెన్యూ భూమిగా మార్చుతూ ఉత్వర్వులు వచ్చాయి.

- జైనూర్ మండలం దబోలిలో 40వేల అటవీ భూముల పంపిణీ
- ఉమ్మడి జిల్లాలో 1.60 లక్షల ఎకరాలు గిరిజనులకు పంపిణీ
- గిరిజనుల భూ బదలాయింపు నిషేధిత చట్టం, గిరిజన ప్రాంతాల రెగ్యులరైజేషన్‌కు రూపకల్పన
- తిర్యాణి మండలంలో గిన్నెధరి, మర్లవాయిలో ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాల ఏర్పాటు
- ఆదివాసీ ప్రాంతాల్లో 30 నూతన పాఠశాలల ఏర్పాటు
- గిరిజన తెగలు, గిరిజన ప్రాంతాలను నోటిఫైడ్‌గా ప్రకటన
- ఐటీడీఏలు, గిరిజన సహకార సంఘాల ఏర్పాటు



స్మృతివనం

ఏఈవోలకు తాఖీదులు


ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో)పై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డిజిటల్ సర్వే చేయాల్సిన ఏఈవోలు తమకు పని భారం అవుతుందని సర్వేకు దూరంగా ఉన్నారు. ఆగ్రహించిన ఉన్నతాధికారులు ఉమ్మడి జిల్లా మొత్తం ఏఈవోలకు మెమోలు జారీ చేశారు. డిజిటల్ సర్వే అంటే పంట పొలానికి వెళ్లి సంబంధిత వ్యవసాయ సిబ్బంది ఫొటో తీసి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సెల్‌ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే అనేక పనులతో తలమునకలై ఉన్నామని, ఈ పనికి సహాయకుడిగా మరో వ్యక్తిని నియమించాలని ఏఈవోలు కోరారు. ప్రభుత్వం ఒప్పుకోకపోగా.. డిజిటల్ సర్వేను పూర్తి చేయాలని తిరిగి ఆదేశించింది. అయినా సర్వే చేయడం కుదరదంటూ రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులుగా ఏఈవోలు సర్వేకు దూరంగా ఉన్నారు. సర్వే మినహా ఇతర పనులు పూర్తి చేస్తున్నా.. ప్రభుత్వ ఆదేశాలు పట్టించుకోకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం చేశారంటూ.. అందరికి మెమోలు జారీ చేసింది.

పల్లెదారులకు రూ.15 కోట్లు మంజూరు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15.07 కోట్లు మంజూరు చేసింది. ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం, ఉట్నూరు, ఖానాపూర్ మండలాల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాలకు నిధులు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉట్నూరు మండలంలోని చాపరాల నుంచి మత్తడిగూడ వరకు 5 కి.మీ.ల రోడ్డు నిర్మాణానికి రూ.5.15 కోట్లు, శంభుగూడ నుంచి సుహినూర్ వరకు 3 కి.మీ రహదారికి రూ.3.24 కోట్లు, జన్నారం నుంచి నర్సింగాపూర్ వరకు 3 కి.మీ రోడ్డుకు రూ.2.94 కోట్లు, పీడబ్ల్యూడీ రహదారి నుంచి నర్సింగాపూర్‌కు రూ.2.50 కోట్లు, ఇదే రహదారిపై కల్వర్టులకు రూ.54 లక్షలు, ఖానాపూర్ మస్కపూర్ వయా చర్చి రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు.

సూర్యప్రతాపం

● ఉమ్మడి జిల్లాలో భిన్న వాతావరణం




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాతావరణంలో మార్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నైరుతి రుతుపవనాల కాలం పూర్తి అయినప్పటికీ మరో నెల రోజులపాటు ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. అడపాదడపా జిల్లావ్యాప్తంగా రాత్రి కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురుస్తున్నా పగటి ఉష్ణోగ్రతలు మాత్రం 35 నుంచి 40 డిగ్రీల నడుమ కొనసాగుతుండటం గమనార్హం. దీంతో మధ్యాహ్నం పూట బయటకు వెళ్లాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఆరోగ్యాల మీద ప్రభావాన్ని చూపుతున్నాయి. -న్యూస్‌టుడే, లక్సెట్టిపేట

మరో మూడు రోజులు ఇవే తిప్పలు

ఉదయం 9 గంటలు దాటిందంటే చాలు వేసవిని తలపిస్తూ భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. సాయంత్రం 4 గంటల వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు ఉక్కపోతతో జిల్లావాసులు సతమతం అవుతున్నారు. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో చాలా జిల్లాలో వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండల తీవ్రత కొనసాగనున్నట్టు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. గడిచిన వారం రోజులుగా ఎండల తీవ్రత కొనసాగుతుండగా రానున్న మూడు రోజులపాటు కూడా జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 38 డిగ్రీల సెంటీగ్రేడ్‌ల మధ్య కొనసాగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

స్వయం చాలక వాతావరణ కేంద్రాల్లో బుధవారం నమోదైన గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతల వివరాలు ఇలా..



ఆరోగ్య సమస్యలు

అసాధారణ వాతావరణ పరిస్థితుల కారణంగా జిల్లావాసులు వివిధ రకాల ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఎండ తీవ్రత, ఉక్కబోత కారణంగా చర్మ సంబంధిత వ్యాధులు పీడిస్తున్నాయి. కొంత మంది ఒళ్లు, కండరాల నొప్పులతోపాటు గొంతు నొప్పి, శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు.

14 రోజులు.. రూ.19.42 కోట్లు

● ఆర్టీసీకి దసరా, బతుకమ్మ పండగ సెలవుల్లో ఆదాయం



ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : దసరా, బతుకమ్మ పండగలు ఆర్టీసీకి కాసులు కురిపించాయి. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం, ఉద్యోగులు, వ్యాపారులు సొంతూళ్లకు బయల్దేరేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో సంస్థకు భారీగా ఆదాయం సమకూరింది. రీజియన్‌లోని ఆరు డిపోల నుంచి హైదరాబాద్‌కు రెగ్యులర్‌గా నడిచే బస్సులతో పాటు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం కలిసివచ్చింది. ఈనెల 1 నుంచి 14 తేదీ వరకు రూ.19.42 కోట్ల ఆదాయం సమకూరింది. 12, 13 తేదీలలో వరుసగా రూ.72.70 లక్షలు, రూ.89.55 లక్షలు మినహాయిస్తే రోజూ సగటున రూ.1.38 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది దసరా సీజన్‌లో 12 రోజుల్లో రూ.11.81 కోట్ల ఆదాయం వచ్చింది.

ఈ నెల 1 నుంచి 14 వరకు వివరాలు

డిపో	మొత్తం ప్రయాణికులు	మహాలక్ష్ములు	ఆదాయం (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	7,05,631	3,77,368	4.02
భైంసా	5,95,744	3,56,985	1.99
నిర్మల్	8,80,500	5,73,128	4.96
ఉట్నూరు	1,95,237	1,21,929	0.90
ఆసిఫాబాద్	5,68,995	3,85,795	2.85
మంచిర్యాల	8,27,740	5,02,679	4.68

61 శాతం మహిళా ప్రయాణికులే

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఉట్నూరు, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోలున్నాయి. ప్రత్యేకంగా హైదరాబాదుకు 412 బస్సులను ఏర్పాటు చేశారు. రీజియన్ వ్యాప్తంగా బస్సులను ప్రతిరోజు సగటున 2.45 లక్షల కిలోమీటర్ల మేర నడిపారు. 14 రోజుల్లో మొత్తంగా 34.34 లక్షల కిలోమీటర్ల మేర బస్సులను నడిచాయి. మొత్తంగా 37.73 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశారు. అందులో ఛార్జీలు చెల్లించిన ప్రయాణికులు 14.55 లక్షల మంది కాగా మహాలక్ష్మి పథకం కింద ఉచితంగా ప్రయాణించిన మహిళలు 23.17 లక్షల మంది కావడం గమనార్హం.

తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు

- సోలోమన్, రీజినల్ మేనేజరు, ఆర్టీసీ

దసరా, బతుకమ్మ పండగలకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. సెలవులు ముగిసినందున తిరుగు ప్రయాణానికి ఇబ్బందులు కలగకుండా అన్ని డిపోల నుంచి బస్సులను నడుపుతున్నాం.